## పని ఒత్తిడితో బిఎల్‌వోల మృతి



2లో



# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd



## గుడేపల్లి గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ



3లో



Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 333 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 26 నవంబర్ 2025


# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

- రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేటితో పూర్ణాహుతి
- ధర్మ ధ్వజం భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం
- ధ్వజారోహణతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయి
- అయోధ్య రామాలయ ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోడీ





**అయోధ్య,నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అయోధ్య రామాలయం శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిం చారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు. ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోదీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి మిగతా2లో...



# జిహెచ్ఎంసి పరిధి మరింత విస్తరణ

- ఓఆర్ఆర్ లోపలా, బయట ఉన్న మున్సిపాలిటీల విలీనం
- మొత్తం 27 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం
- కొత్తగా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు నిర్ణయం
- ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో రామగుండంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు
- పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడులకు ఆహ్వానం
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



**హైదరాబాద్,నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్నా 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను డిప్యూటి సిఎం,మంత్రి శ్రీధర్‌బాబు,జూపల్లి కృష్ణారావులు మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ మిగతా2లో...

# మన నాగరికత భారతదేశానికి పునాది

- మన మూలాల్లోకి తిరిగి కనెక్ట్ అవుదాం
- అయోధ్య ధ్వజ్ ఆరోహణపై పవన్



**అమరావతి,నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మేధో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం మిగతా2లో...

# చెక్ డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే...

## - గుంపుల వద్ద డ్యామ్‌ను పరిశీలించిన హరీష్ రావు



**పెద్దపల్లి, 25(పీసీడబ్ల్యూ న్యూస్):** కెసిఆర్ హయాంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ ఎవరు కట్టారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల వద్ద పేల్చిన చెక్ డ్యామ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, దాసరి మనోహర్ రెడ్డి, రసమయి బాలకిషన్, నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి మిగతా2లో...

# నగరంలో ఉన్న విలువైన భూములు హాంఫట్

- 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ
- రాత్రికి రాత్రే బిలియనీర్ కావాలన్న లక్ష్యంతో కదుపుతున్న పావులు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** సిఎం రేవంత్ రెడ్డి అవినీతి కోసమే హిల్ట్ పాలసీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీ అని అన్నారు. విద్యార్థులు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెడుతూ రేవంత్ సర్కార్ హిల్ట్ పాలసీకి నిర్ణయం తీసుకుందని కేటీఆర్ అన్నారు. ఒకప్పుడు పరిశ్రమలు, ప్రజల ఉపాధి కోసం ఇచ్చిన భూములను ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే ప్రభుత్వం అనుమతినిస్తోందని తెలిపారు. దాదాపు మిగతా2లో...





# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

## ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు ప్రారంభం

**హైదరాబాద్,నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 నిర్వహణ, సంబంధిత ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివిధ విభాగాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మిగతా2లో...

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

- మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడి







**హైదరాబాద్,నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించ నున్నారు. ఈ మేరకునోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. మంగళ వారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటల మిగతా2లో...

# చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

- లోతైన దర్యాప్తు జరిపించాలన్న బండి
- సిఎం రేవంత్ రెడ్డికి లేఖ



**హైదరాబాద్,నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో చెక్ డ్యామ్‌లు కూలిపోవడంపై అనుమానాలున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. వీటిపై విచారణ జరగాలని అన్నారు. ఎందుకు ఇలా జరుగుతున్నా యో తేల్చాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మానేరు నదిపై కట్టిన చెక్ డ్యామ్‌లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనుగుల- గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూలడమే ఇందుకు మిగతా2లో...

# భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షి అయోధ్య

(మొదటి పేజీ తరువాయి)

ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు, దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతు ందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయోధ్యలో ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ సాంస్కృతిక చైతన్యానికి అయోధ్య సాక్షిగా నిలిచిందన్నారు. రామభక్తుల సంకల్పం సిద్ధించింది. కోట్లాది మంది కల సాకారమైంది. శతాబ్దాల నాటి గాయాలు, బాధల నుంచి నేడు ఉపశమనం లభించింది. 500 ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమైంది. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నమస్కరిస్తున్నా. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగింది. ధర్మధ్వజం కేవలం జెండా కాదు.. భారతీయ సంస్కృతి పునర్వికాసానికి చిహ్నం. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం ప్రతీక. శ్రీరాముడి సిద్ధాంతాలను ఈ జెండా ప్రపంచానికి చాటుతుంది. స్ఫూర్తి, ప్రేరణను ఇస్తుంది. కర్మ, కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మధ్వజం చెబుతుందని మోదీ పేర్కొన్నారు. రాముడు కులం చూడడు.. కేవలం భక్తి మాత్రమే చూస్తాడు. ధర్మధ్వజంపై కోవిదార్ వృక్షం మన ఇతిహాసాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. అయితే మన చుట్టూ కొందరు ఇంకా బానిస భావజాలంతో ఉన్నారు. రాముడు ఓ కాల్పనిక వ్యక్తి అని వారు అంటున్నారు. అలాంటి బానిస భావజాలం ఉన్న వ్యక్తులకు చోటు ఇవ్వొద్దు. భారత్‌లో ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో రాముడు ఉన్నాడు. ప్రజాస్వామ్యానికి భారత్ పుట్టినిల్లు. ఇది మన డీఎన్‌ఏలోనే ఉంది. శతాబ్దాల క్రితమే భారత్‌లో ప్రజాస్వామ్య విధానం ఉంది. తమిళనాడులోని ఉత్తర మేరూర్ శాసనం ప్రజాస్వామ్యం గురించి చెబుతోంది. వచ్చే వెయ్యేళ్లు భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటాలి. మానవ వికాసానికి అయోధ్య కొత్త నమూనా ఇస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. కాషాయ జెండా సూర్యవంశానికి చిహ్నమని, ఓం అక్షరం.. కోవింద వృక్షం .. రామరాజ్యానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. సంకల్పానికి, సక్సెస్‌కు ఈ జెండా చిహ్నమన్నారు. వందేళ్ల పోరాటానికి.. రాబోయే వేల శతాబ్దాలకు ఈ జెండా రాముడి విలువలను చాటుతుందన్నారు. సత్యమే ధర్మం అని ప్రధాని మోదీ అన్నారు. వివక్ష, బాధ ఉండకూడదని, శాంతి.. సంతోషం ఉండాలన్నారు. పేదరికం ఉండకూడదని, ఎవరూ నిస్సహాయంగా ఉండరాదన్నారు. గుడికి రాలేని వారు, గుడిపై ఎగురుతున్న జెండాను చూసినా.. వారికి అంతే పుణ్యం దక్కుతుందని మన గ్రంథాలు చెబుతాయని, చాలా దూరం నుంచి కూడా జెండాను చూసి రామ్‌లల్లా పుట్టిన ప్రదేశం ఇదే అన్న ప్రేరణ పొందవచ్చు అన్నారు. ఈ అద్భుతమైన సందర్భంలో కోట్లాది మంది రామ భక్తులకు హృదయ పూర్వక గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రామాలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రామాలయ నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్క కార్మికుడు, కళాకారుడు, ప్లానర్, ఆర్కిటెక్ట్, వర్కర్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

# జిహెచ్ఎంసి పరిధి మరింత విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో హైదరాబాద్ పరిధి మరింత పెరుగుతందన్నారు. అంతేకాకుండా మరో విద్యుత్ డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రులు తెలిపారు. కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ క్రమంలో 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలుకు కేబినేట్ ఆమోదించింది. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానించాలన ఇనిర్ణయించారు. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం కోసం కేబినేట్ ఆమోదించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌ను 3 సర్కిళు గా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించారు. భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీ ఫైబర్ కేబుళ్ల ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపునకు ఆమోదించారు. అలాగే ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు ఇవ్వనున్నారు. జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు.

# నగరంలో ఉన్న విలువైన భూములు హాంఫట్

(మొదటి పేజీ తరువాయి)

9,292 ఎకరాలు ధారాదత్తం చేసేందుకు హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నారని కేటీఆర్ తెలిపారు. దాదాపు ఆ భూములన్నింటికీ రేవంత్ సోదరులు, అనుయాయు లు ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొన్నారు. లక్షన్నర గజం విలువ చేసే భూమికి 10 వేలు కడితే చాలని పాలసీ తెచ్చారని తెలిపారు. పారిశ్రామిక వాడల భూములను అమ్మి 4-5లక్షల కోట్ల కుంభకోణం చేయాలని చూస్తున్నాడని అన్నారు. అంబానీ, అదానీ లను ఒకే దెబ్బకు క్రాస్ చేయాలని రేవంత్ రెడ్డి స్కెచ్ వేశారని తెలిపారు. రేవంత్ రెడ్డి మనుమలు, మునిమలు కూర్చొని తిన్నా కూడా అరిగిపోని ఆస్తిని వెనకేసుకోవాలని ఈ స్కామ్‌కు తెరతీశాడని చెప్పారు. 50-60 ఏళ్లుగా హైదరాబాద్ లో 21 పారిశ్రామిక వాడలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ప్రజల భూములు తీసుకుని ప్రభుత్వం పరిశ్రమలకు ఇచ్చిందని చెప్పారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ పరిశ్రమలు మధ్యలోకి వచ్చాయని తెలిపారు. మేం అధికారంలో ఉన్నప్పుడు కూడా పారిశ్రామిక భూముల రెగ్యులరైజేషన్ ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమలు లేదా కంపెనీలు ఏర్పాటు చేయాలని సూచించామని చెప్పారు. అందుకే మేం గ్రిడ్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. గతంలో 50 శాతం ఐటీ ఆఫీసులకు, 50 శాతం ఇతర అవసరాల కోసం ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టినంకనే అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ధారాదత్తం చేస్తోందని అన్నారు. భూదందాపై విద్యార్థి నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై కౌన్సిల్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నిలదీశారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ వనరులను కాపాడు కునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయాల్లో 42 శాతం కోటా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చారని పేర్కొన్నా రు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వే షన్ల పెంపు కోర్టు ఆపింది.. మిగతావి ఎవరు ఆపారని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ముస్లిం లందరికీ న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. ముస్లింలకు 4 వేల కోట్లు బ్జడెట్‌లో పెడతామని.. పెట్టలేదని మండిపడ్డారు.తెలంగాణపై బీఆర్ఎస్‌కు ఉన్న ప్రేమ ఏ పార్టీకి ఉండదని కేటీఆర్ అన్నారు. తెచ్చిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. తెలంగాణ వనరులను కాపాడుకునే బాధ్యత విద్యార్థులకు కూడా ఉందని తెలిపారు. కాంగ్రెస్ అరాచకాలపై విద్యార్థి రణభేరీ మోగించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. నాయకులు సమాజం నుంచి వస్తారు.. నాయకుల చుట్టూ తిరిగితే నాయకులు కారని వ్యాఖ్యానించారు.

# చెక్ డ్యామ్ కూల్చివేత ఇసుక మాఫియా పనే...

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను కూల్చివేసింది కాంగ్రెస్ నేతలేనన్నారు. కాంగ్రెస్ హయంలో చెరువులు, చెక్ డ్యామ్‌ల పేల్చివేత నిత్య చర్యగా మారిందన్నారు. గతంలో పెద్దపల్లి భోజన్న పేట వద్ద హుస్సేన్ మియావాగుపై కూడా చెక్ డ్యామ్ పేల్చివేశారని ఆరోపించారు. గుంపుల వద్ద చెక్ డ్యామ్ కూడా కులలేదని.. పేల్చారని ఇక్కడి రైతులే చెప్తున్నారన్నారు. ఇసుక మాఫియానే కూల్చివేసిందని, కాంగ్రెస్ పాలనలో వేల కొద్ది లారీల్లో ఇసుక తరలిస్తున్నారన్నారు. రాత్రికి రాత్రి చెక్ డ్యామ్ పేల్చేశారని.. భోజన్నపేటలో హుస్సేన్ మియావాగుపై చెక్ డ్యామ్ పేల్చివేస్తుంటే రైతులే పట్టుకున్నారన్నారు. అప్పుడు రైతులే కేసులు పెట్టారని.. పోలీసులు ఇప్పటివరకు దోషులను పట్టుకోలేదని ఆరోపించారు. తాజాగా మరో చెక్ డ్యామ్ పేల్చారని.. అప్పుడే పోలీసులు దోషులను శిక్షిస్తే.. ఈ రోజు గుంపుల చెక్ డ్యామ్‌కు ఈ పరిస్థితి రాకుండేదన్నారు. ఈరోజు వరకు పోలీసులు వాళ్లను పట్టుకోలేదని.. మూడు రోజులు అయిన ఇక్కడి పేల్చవేత దోషులను పోలీసులు పట్టుకోలేకపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లను కాపాడుతుందని.. ఆనాడు గుండాలను అరెస్ట్ చేస్తే ఈ రోజు ఇక్కడి చెక్ డ్యామ్ పేల్చకపోయేవాళ్లని.. హైదరాబాద్‌లో ఇండ్లు, ఇక్కడ చెరువులు, చెక్ డ్యామ్‌లు కూలగొడుతున్నారన్నారు. కేసీఆర్ కట్టుడు.. కాంగ్రెసోళ్ల కూలగొట్టుడని.. మానేరు నది మీద చెక్ డ్యామ్‌లు కట్టి సస్యశ్యామలం చేశామన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ కట్టిందని..



చర్యలు తీసుకోవాలంటే పొంగులేటిపై తీసుకోవాలన్నారు. రాఘవ కంపెనీని బ్లాక్ చేయాలన్నారు. పొంగులేటి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 6 లక్షల ఎకరాలు నీళ్లు ఇస్తామని ఉత్తమ్ కుమార్ చెప్పిండని.. ఎక్కడ ఇచ్చారో చెప్పాలన్నారు. కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని.. రెండేళ్లు అయిన కాళేశ్వరం రిపేర్ చేయడం లేదని.. కాళేశ్వరం కింద ఉన్న కాలువలు తవ్వడం లేదన్నారు. కాలువలు తవ్వితే కేసీఆర్‌కు పేరు వస్తుందని రైతును గోసపెడుతున్నారన్నారు. కాళేశ్వరం కూలిందని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు తీసుకుపోతున్న నీళ్లు కాళేశ్వరంవికావా అంటూ ప్రశ్నించారు. ఈ బ్లాస్టింగ్స్ చూస్తే కాళేశ్వరం కూడా పేల్చారని అనుమానం వస్తుందన్నారు. పెద్దపల్లిలో జిలిటెన్ స్టిక్స్‌తో కాంగ్రెస్ నాయకులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని.. ఇసుక మాఫియాతో రూ.24 కోట్లు రికవరీ చేయాలన్నారు. ఎండాకాలం లోపే చెక్ డ్యామ్ నిర్మించాలని.. ఇసుక మాఫియాలో మంత్రుల వాటా ఉందని.. రాత్రిపూట పెద్దశబ్దం వినపడిందని అని మత్స్యకారులు చెప్తున్నారన్నారు. లక్ష క్యూసెక్కుల వరద వస్తే కూడా ఈ చెక్ డ్యామ్ చెక్కు చెదరలేదన్నారు. కూలితే రాత్రే ఎందుకు కూలింది? కూలలేదు కూల్చారు అంటూ ఆరోపించారు. కాంగ్రెస్‌కు రైతుల కన్నా ఇసుక మాఫియా ముఖ్యమన్నారు. టెర్రరిస్టులు కూడా ఇలాంటి పనులు చేయరని, టెర్రరిస్టులకు మించిపోయారని.. ఇసుక మాఫియా దోషులను శిక్షించకుంటే రాష్ట్రంలో మరిన్ని చెక్ డ్యామ్‌లు పేలుస్తారన్నారు. కేసీఆర్‌పై కోపంతో రాష్ట్ర రైతుల నోట్లో మట్టికొడుతున్నారని.. కాళేశ్వరం కూలిందని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. కాళేశ్వరంలో భాగంగా కట్టిన మల్లన్న సాగర్ నుంచి రూ.8వేల కోట్లతో హైదరాబాద్‌కు పైపులైన్ వేస్తా అంటున్నాడన్న హరీశ్ రావు.. మల్లన్న సాగర్ ఎవరు కట్టారు నీ తాత కట్టిండా..? కేసీఆర్ కాదా? అంటూ ప్రశ్నించారు. ఇసుక మాఫియాపై ఉన్నత స్థాయి విచారణ జరగాల్సి ఒదేనన్నారు. నిందితులు ఎవరైనా వారి నుంచి రూ.24కోట్లు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# మన నాగరికత భారతదేశానికి పునాది

(మొదటి పేజీ తరువాయి)

నేర్పిన మేధో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని.. మన మూలాలతో తిరిగి కనెక్ట్ అవుదామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నేటి నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని కారణాల వల్ల అక్టోబర్ 9న షెడ్యూల్‌పై స్టే విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,200 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం అని ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. గురువారం నుంచి తొలి విడత పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడత ఎన్నికలకు ఈ నెల 30 నుంచి, మూడో విడత ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనుండగా.. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు.

# చెక్‌డ్యామ్‌లు కుప్పకూలడంపై అనుమానం

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శనమన్నారు. బిఆర్ఎస్ పాలనతో కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యతను గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో చెక్ డ్యామ్‌లను నిర్మించిన కాంట్రాక్టర్లు కాంగ్రెస్ వాళ్లేనని అన్నారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిధుల చెల్లింపులపై మీరు ఆదేశించిన విజిలెన్స్ విచారణ ఏమైందని బండి ప్రశ్నించారు. ఆనాడు బాధ్యులపై చర్యలు తీసుకొని దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే తనుగుల-గుంపుల చెక్ డ్యామ్ కూలేది కాదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ డ్రామాలాడుతున్నాయి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే చెక్ డ్యామ్‌ల నిర్మాణాల్లో అక్రమాలు, కూలిపోవడంపై విచారణ జరిపించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారి ఆస్తులు జప్తు చేసి ఆ సొమ్ముతోనే మళ్లీ డ్యామ్‌లు నిర్మించాలని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ కు తుది మెరుగులు దిద్దుతున్నారు. మంగళవారం నుంచి నవంబర్ 30 వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్లో వరుసగా ఈ సమీక్ష సమావేశాలు జరుగుతాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్బాబు వరుసగా జరిగే అన్ని సమావేశాల్లో పాల్గొంటారు. ఆయా విభాగాల సమీక్షలో సంబంధిత మంత్రులు పాల్గొంటారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహణ ఏర్పాట్లు తదితర అంశాలపై మంగళవారం సీఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఆయా విభాగాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. బుధవారం మౌలిక వసతులు, అభివృద్ధిపై సీఎంతో పాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. సంబంధిత విభాగాల అధికారులు పాల్గొంటారు. నవంబర్ 28న విద్య, యువజన సంక్షేమంపై సాయంత్రం 4 గంటలకు సీఎంతో పాటు మంత్రులు వాకాటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు టూరిజం, టెంపుల్ టూరిజంపై మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. నవంబర్ 29 వ్యవసాయం, సంక్షేమ విభాగాలతో సాయంత్రం 4 గంటలకు: మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వాకాటి శ్రీహరి సంబంధిత అధికారులుతో సమీక్షిస్తారు. సాయంత్రం 6 గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , సీతక్క, మోహమ్మద్ అజరుద్దీన్ పాల్గొంటారు. నవంబర్ 30న ఆరోగ్య రంగంపై సీఎంతో పాటు మంత్రి దామోదర్ రాజనరసింహ సంబంధిత అధికారులు పాల్గొంటారు.

# పని ఒత్తిడితో బిఎల్‌వోల మృతి

- సుప్రీంను ఆశ్రయించిన పలు రాష్ట్రాలు
- నివేదిక కోరిన కేంద్ర ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ,నవంబర్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే అధిక పనిభారం, ఒత్తిడి కారణంగా బూత్ లెవెల్ అధికారులు పలువురు మరణించినట్టు ఆరోపణలు వస్తుండటంపై భారత ఎన్నికల సంఘం దృష్టి సారించింది. దీనిపై వివరాలు కోరుతూ 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్య ఎన్నికల అధికారుల నుండి మంగళవారంనాడు నివేదికలను కోరింది. బీఎల్‌ఓలు పని ఒత్తిడి కారణంగా మరణిస్తున్నారని, ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని పలు రాష్ట్రాలు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ తాజా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ విధుల్లో ఉన్న కొందరు బీఎల్‌ఓలు తీవ్రమైన పనిభారం, ఒత్తడిని ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మూడు వారాల్లో 16 మంది బీఎల్‌ఓలు మరణించినట్టు కథనాలు రావడం కూడా రాజకీయ వినవాదానికి దారితీసింది. కేంద్ర ఎన్నికల సంఘం హడావిడి ప్రక్రియపై పలు పార్టీలు విమర్శలు గుప్పించాయి. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఈ మరణాలు నమోదైనట్టు కథనాలు వచ్చాయి. బీఎల్‌ఓల మరమాణాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇవి ఎస్ఐఆర్ సంస్కరణలు కావని, బలవంతంగా రుద్దుతున్న నిరంకుశత్వమని రాహుల్ విమర్శించారు. ఈ ప్రక్రియతో ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాలి? ఎన్ని మృతదేహాలు చూడాలని మమతాబెనర్జీ ప్రశ్నించారు. బీఎల్‌ఏలకు సరైన వనరులు కల్పించకుండా హడావిడిగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించడమే ఈ మరణాలకు కారణమని అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లోని బనగావ్‌లో మమతాబెనర్జీ మంగళవారంనాడు భారీ ర్యాలీ నిర్వహించారు.

# గుడేపల్లి గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

### మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ అండ








**రేగొండ, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గుడేపల్లి గ్రామంలో పేద మహిళల కోసం నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మంగళవారం గ్రామ పంచాయతీ పరిధిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోలుసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పేద మహిళల చిరునవ్వులే మా బలం. మధ్యవర్తిత్వం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేయడం మా గ్రామ కాంగ్రెస్ కమిటీ ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. కుటుంబ బలోపేతానికి మహిళలే మూలస్తంభాలని, వారికి అందే చిన్న సహాయం కూడా జీవనోపాధిలో పెద్ద మార్పులు తీసుకువస్తుందని శ్రీనివాసరావు అన్నారు. అభివృద్ధి-సంక్షేమ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ కట్టుబాటును వివరించిన ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను గ్రామానికి తీసుకురావడానికి సమిష్టిగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పంచనేని వెంకట్రావు, గ్రామ ఉపాధ్యక్షులు మోరే కుమార్, యూత్ అధ్యక్షులు ముద్దమల్ల నరేష్, మాజీ ఉపసర్పంచ్ నూకల సంపత్, గ్రామ కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, లింగంపల్లి తిరుపతిరావు, నిమ్మల కిరణ్ రావు, అలాగే సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కటాక్ష పూర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ



**ఆత్మకూరు, నవంబర్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ మహిళలకు చీరలు అందజేయడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత పట్ల మహిళలు ప్రత్యేకంగా ఆనందం తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను మహిళలు అభినందించారు. గ్రామ మహిళలు, గ్రామస్తుల తరఫున ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి మహమ్మద్ గఫూర్ డి రాజు, రాజు నాయక్, లింగదారి రమేష్, రజియా, నాగమణి, లక్ష్మణ్ గ్రామ కమిటీ అధ్యక్షులు బిక్షపతి ఉపాధ్యక్షులు సతీష్ మాజీ వార్డు సభ్యులు భూక్య అరుణ రమేష్, బిక్షపతి ఉప సర్పంచ్ సాంబయ్య పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీలో చేరిక




**మల్లంపల్లి మండల ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల నాయకుల ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరిన గుండెబోయిన రవి యాదవ్ వారిని ములుగు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు అలాగే గుండెబోయిన రవి గారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి పేద మధ్యతరగతికి అందే విధంగా అమలు చేస్తున్న పథకాలను చూసి ఆర్నిసులై ఈరోజు భారతీయ జనతా పార్టీలో చేరడం జరిగింది అలాగే ములుగు జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ గారి పాలన సుపరిపాలనగా పేరుపొంది ప్రపంచంలోనే అతి పెద్ద దేశంగా అవతరించనుంది రానున్న రోజుల్లో తెలంగాణలో కాషాయం జెండా ఎగిరే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షులు జీనుకాల కృష్ణాకర్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు దండిగా వెంకన్న, ములుగు మండల మాజీ అధ్యక్షులు గాదం కుమార్, బీజేవైఎం ములుగు జిల్లా జనరల్ సెక్రెటరీ కత్తి హరీష్ గౌడ్,బైకాని మహేందర్ యాదవ్, గొట్టేముక్కల రాకేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగమా ఏది నీకు రక్షణ

ఓ రాజ్యాంగమా నీ ద్వారా
అంబేద్కర్ మహనీయుడు మాకు ఎస్సి. ఎస్టీ. బిసిలకు
రక్షణ కావచంగా నిలిపాడు
కార్మికవర్గాలకురక్షణగాజి
రూపొందించిన చట్టాలను
నిర్వీర్యం చేస్తూ
నాలుగు లేబర్ కొడులుగా
మర్చిండ్లు పారిశ్రామిక వేత్తలకు అనుకూలముగా.

ఈ దేశంలో మత. కుల. లింగ
వివక్ష లేకుండా సమానత్వాన్నిచ్చావు
ప్రతి పౌరుడు తన ఆలోచనలను
చెప్పుకోవడానికి భావప్రకటన
స్వేచ్ఛను ఇచ్చావు

అన్ని వర్గాల ప్రజలు
కార్మిక. కర్షక. మహిళలకు
ఎన్నో హక్కులను పొందుపరిచావు
ధనిక. పేద తేడా లేకుండా
అందరికి ఓటు హక్కును ఇచ్చావు

ప్రతి పౌరునికి విద్య. వైద్యం
ఉపాధి. శాస్త్ర జ్ఞానం అందించాలని
మౌలిక సదుపాయాలను కల్పించాలని
రాజ్యాంగం ద్వారా పాలకులకు
ఆదేశించవు

ఓ అంబేద్కర
మాకు రక్షణ కవచముగా
రాజ్యాంగాన్ని అందించవు
కానీ.
దీన్ని జీర్ణించుకోలేని
మనువాద పాలకులు రాజ్యాంగాన్ని మార్చడానికి
తుట్లు పొడుస్తుండ్లు.

తమ హక్కులకై కార్మికులు
సమ్మె చేయడం నేరం
సమ్మె చేస్తే చట్టవిరుద్ధం
పాలకుల అక్రమాలు. అన్యాయాలను
ప్రశ్నిస్తే నేరం దేశద్రోహం
మాట్లాడితే రాజా ద్రోహం

ఓరాజ్యాంగమా
దేశానికీ నీవే ధిక్కుసి వంటూ
రాజ్యాంగ పరిరక్షణ ఉత్సవాలు
ఉక దంపుడు మాటలతో
నిన్ను పొగుడుతూనే
నీ మెడపై కత్తి పెట్టుతుండ్లు
నిన్ను చంపడానికి



\- గొడిసెల శ్రీహరి

# 28న చలో సూర్యాపేట రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయండి

### ఇంటికో గౌడ్ ఊరికో వాహనంతో కదిలి రావాలి





**ములుగు జిల్లా, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** జంగాలపల్లి ఇంచర్ల మరియు అబ్బాపూర్ తాటి వనాల్లో రణభేరి పోస్టర్ ఆవిష్కరణ చేసిన కల్లు గీత కార్మికులు కల్లు గీత కార్మిక సంఘంజిల్లా ఉపాధ్యక్షులు సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు మునిగాల సుధాకర్ గౌడ్ ములుగు ఇంచర్ల -అబ్బాపూర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28 చలో సూర్యాపేట రణబేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉయ్యాల మధుకర్ గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు మునిగాల సుధాకర్ గౌడ్ లు గీత కార్మికుల కు పిలుపు నిచ్చారు సోమవారం రోజున ములుగు మండలం లోని జంగాలపల్లి (ఇంచర్ల) సోసైటీ మరియు అబ్బాపూర్ సోసైటీ లలో నిరేణుక ఎల్లమ్మ గుడి ఆవరణలో ఈనెల 28 న జరుగుచలో సూర్యాపేట రణభేరి పోస్టర్ లను సొసైటీ అధ్యక్షులు జనగాం శ్రీనివాస్ గౌడ్. మోటపోతుల రఘుపతి గౌడ్ ల అధ్యక్షతన ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉయ్యాల మధుకర్ గౌడ్ మునిగాల సుధాకర్ గౌడ్ లు మాట్లాడుతూ ప్రభుత్వం 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులందరికీ ఎటువంటి షరతులు లేకుండా వృత్తి పింఛను 4000 ఇవ్వాలనిఅలాగే గీత వృత్తి పింఛన్ సైట్ను తక్షణమే ఓపెన్ చేయాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు తాటి ఈత చెట్ల పెంపకానికి 10 ఎకరాల భూమి ప్రభుత్వం కొనుగోలు చేసి ఇవ్వాలని అలాగే పెండింగ్లో ఉన్న ఎక్సిగ్రేసియాలు తాడి కార్పొరేషన్ చెక్కులు తక్షణమే విడుదల చేయాలని ఏజెన్సీ పేరుతో రద్దు చేసిన గీత సోసైటీ లను తక్షణమే పునరుద్దరణ చేయాలనీ డిమాండ్ చేస్తూ ఈనెల 28న సూర్యాపేట లో జరుగు రణభేరి బహిరంగ సభ కు మండలం నుండి అన్ని గ్రామాలనుండి గీత కార్మికులు కదిలి రావాలని కల్లుగీత కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో అబ్బా పూర్ మరియు ఇంచెర్ల గౌడ సంఘం సొసైటీ సభ్యులు ఆరెల్లి సదానందం గౌడ్ మోట పోతుల సురేందర్ గౌడ్ తాళ్ళ పెల్లి సారయ్య గౌడ్ దూలం శ్రీనివాస్ గౌడ్ బీమగాని సాంబయ్య బీమగాని బిక్షపతి గౌడ్ వేముల కృష్ణ గౌడ్ వేముల వెణు గౌడ్ రాగుల ప్రణయ్ గౌడ్ తో పాటు 20 మంది గీత కార్మికులు పాల్గొన్నారు

# పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందజేసిన సీఐ మల్లేష్



**చిట్యాల, నవంబరు 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలంలోని అందుకుతండ గ్రామానికి చెందిన గోపాల్. గద్దర్. అనే వ్యక్తులు రెండు నెలల క్రితం మార్గమధ్యంలో పోగొట్టుకున్న ఒప్పో, మోటో. మొబైల్ ఫోన్లను చిట్యాల పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. బాధితులు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, చిట్యాల ఎస్ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ లాల్ సింగ్ అట్టి మొబైల్ ఫోన్ల వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఆ ఫోన్లను గుర్తించి, చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ బాధితులకు తిరిగి అందజేశారు. తమ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి ఇప్పించినందుకు బాధితులు చిట్యాల సీఐ మల్లేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పలు సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన జివిఎస్ ఆర్ కాలనీవాసులు



**హన్మకొండ,నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** గుండ్ల సింగారం లోని జి వి ఎస్ ఆర్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కాలనీ లోని పలు సమస్యల పై స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ని కలిసి పలు సమస్యల పైన సిసి రోడ్స్, డ్రైనేజీ సిస్టం, విద్యుత్ స్తంభాలు గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తక్షణమే అభివృద్ధి పనులు మొదలు పెడతానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సింగులాలు, జి వి ఎస్ ఆర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుక్కల రాజు, ఉపాధ్యక్షులు రుద్రారం ప్రశాంత్, ప్రధాన సలహా దారుడు కుక్కమూడి వంశీ, కోశాధికారి వైనాల యాకయ్య, కమిటీ సభ్యులు మల్లయ్య, పరమాత్మ, కొమురయ్య, సుమన్, దాసరి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగట్టు గుట్ట దేవస్థానం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మార్వో

**హన్మకొండ, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొంతమంది కబ్జాదారులు కన్నేసి ఎలాగైనా దేవస్థాన భూమిని ఆక్రమించు కోవాలని చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టుటకు హసన్ పర్తి తహసిల్దార్ మంగళవారం తన సిబ్బందితో దేవస్థాన స్థలాన్ని పరిశీలించారు. కొంతమంది సర్వే నంబర్లు మార్చి 137 గా చిత్రీకరించి స్థలాన్ని కబ్జా చేయుటకు ప్రయత్నిస్తున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు తాసిల్దార్ కిరణ్ కుమార్ కు వివరించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు దేవస్థాన భూమిని తహసిల్దార్ కు చూపించడం జరిగిందని వారు తెలిపారు. స్థల పరిశీలన చేసిన తహసిల్దార్ దేవస్థాన భూమి 127 సర్వే నెంబర్ లో ఉందని చూపించే రికార్డులను చూసి పూర్తి వివరాల తో కూడిన పత్రాలను తమకు అందిస్తానని కాంగ్రెస్ కార్యకర్తలకు హామీ ఇచ్చారు. అధికారులు మారిన ప్రతిసారి ఎలాంటి వివాదాలు జరగకుండా దేవస్థాన భూమిని పకడ్బందీ చేసే ఉంచుతామని హామీ ఇచ్చారు. తహసిల్దార్ కు వివరాలు ఇచ్చిన వారిలో దేవస్థాన కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ చైర్మన్ జన్ను రవీందర్, మాజీ జెడ్పిటిసి వింజమూరు వెంకటేశ్వర్లు, 66 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కోడెల మురళి, గొర్రె కిరణ్, సాంబయ్య, హసన్ పర్తి జిపిఓ లు ఉన్నారు.



# మన ఊరు - మన బడి బిల్లులు ఇప్పించండి




**తల్లాడ,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల బిల్లులు వెంటనే ఇప్పించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని తల్లాడ మాజీ సర్పంచ్ వజ్రాల రామిరెడ్డి మంగళవారం కలిశారు. తెలంగాణ శాసనమండలిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కలసి వారి బాధలు వ్యక్తపరిచారు. వెంటనే స్పందించి మన ఊరు మనబడి బిల్లులు ఇప్పించాలని మండల సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రామిరెడ్డి వినతి పత్రం అందజేశారు.

## సుడా చైర్మన్‌ను కలిసిన కర్ర రాజశేఖర్, అంజన్ కుమార్





**కరీంనగర్ టౌన్ నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల జరిగిన అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో విజయం సాధించి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కర్ర రాజశేఖర్ మరియు నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ అంజన్ కుమార్ మంగళవారం సుడా చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతాభివృద్ధి, ప్రజాసేవా కార్యక్రమాలు వంటి పలు అంశాలపై వారు చర్చించారు. కొత్త పదవుల్లోకి వచ్చిన ఇద్దరికీ సుడా చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ములుగు ఎస్సీని కలిసిన ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు



**హన్మకొండ,నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్లో టెక్నికల్ డీఈ గా పనిచేసిన ఆనందం ములుగు జిల్లా ఎస్సీగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ విద్యుత్ భవన్ లో ములుగు ఎస్సీ ఆనందం ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (202/2010) స్టేట్ జనరల్ సెక్రెటరీ బి. దానయ్య (డీఈ), ఎన్పీడీసీఎల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, హన్మకొండ టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ జడల రవి, మహేష్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## అంగన్వాడీల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

**- అంగన్వాడి భవనంను ప్రారంభించిన ఎమ్మెల్యే**





**సత్తుపల్లి,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అంగన్వాడీల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమై దయానంద్ అన్నారు.మండలం పరిది చెరుకుపల్లి గ్రామం లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నూతనముగా ఏర్పాటుచేసిన అంగన్వాడీ భవనంను మంగళవారం సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాఘమై దయానంద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీలకు పక్కా భవనాలు ఉండాలని సదుద్దేశంతో ప్రభుత్వం ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంగన్వాడీల బలోపేతం సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు.0 నుండి 5 సంవత్సరముల వరకు అంగనవాడి కేంద్రాలలో మంచి క్రమశిక్షణ తో పాటు పౌష్టిక ఆహారం అందించబడుతుందని తెలిపారు. గర్భిణులకు బాలింతలకు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం ద్వారా వారు ఆరోగ్యవంతులుగా ఉంటున్నారని అన్నారు. అనంతరం చెరుకుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు

**ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ**

**మహిళ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**





**రామడుగు, నవంబర్ 25 (పిసిడబ్ల్యు న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో మంగళవారం ఇందిరమ్మ మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీఎంఆర్ చెక్కుల పంపిణీ చీరల గౌడ కులస్తులకు కాటమయ్యపంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు 18 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మహిళా సంక్షేమానికి దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకుఆర్టీసీ ఉచితప్రయాణం 500 కే గ్యాస్ సిలిండర్ ఇందిరమ్మ క్యాంటీన్లు మహిళా సంఘం కోసం రుణమాఫీ తదితర పథకం అమలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎంపీడీవో ఇతర శాఖల అధికారులు మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మరవేణి తిరుమల-తిరుపతి, మాజీ ఎంపిపిలు జవ్వాజి హరిష్, వీర్ల నర్సింగరావు, సింగిల్విండో చైర్మెన్ ఒంటెల మురళి క్రిష్ణ రెడ్డి, ఉప్పు అంజనిప్రసాద్, దేశరాజుపల్లి మాజీ సర్పంచ్ కోల రమేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, నాయకులు బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శిపంజాల శ్రీను నేరళ్ళ ఆంజనేయులు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనుపురం పరుశురాం మామిడి దిలీప్ రేను కుంటబాపు రాజు మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఆసిఫ్ గ్రామ శాఖ రామడుగు అధ్యక్షుడు కర్ణ శ్రీనివాస్ పొన్నం మహేష్ కత్తి మధు మడ్డి ఆంజనేయులు నీలం లక్ష్మణ్ హన్మంతు ఆధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మనువాధాన్ని మట్టుపేడదాం!

**రాజ్యాంగాన్ని ఎత్తిపడదాం!**

**రిపబ్లిక్ డేను అంబేద్కర్ డే గా ప్రకటించాలి!**

**నవంబర్ 26 నుండి జనవరి 26 వరకు భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ యాత్ర ప్రారంభం.**

**అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించాలి.**

**ఎస్సిలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలి.**

**రౌతు రమేష్ కుమార్ డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు.**

**చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు.**

**హన్మకొండ,నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకి ప్రాణం పోసిన భారత రాజ్యాంగ ముసాయిదా చేపట్టిన చారిత్రాత్మక దినం నవంబర్ 26, జాతీయ రాజ్యాంగ దినోత్సవం. అలాగే జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని స్మరించు కొవాలని, రిపబ్లిక్ డే ను అంబేద్కర్ డే గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాలని డిబిఎఫ్ అధ్వర్యంలో హనుమకొండ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నాడు డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ ఫలాలు అందరికి అందే విదంగా ప్రభుత్వాలు కృషి చేయాలని నవంబర్ 26 నుండి జనవరి 26 వరకు నిర్వహించే భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్, చుంచు రాజేందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజును గుర్తు చేసుకుంటూ రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలందరు జరుపు కొవాలని, ప్రతి పాఠశాలలో రాజ్యాంగ పిఠిక ను ప్రతిజ్ఞ సమయంలో చదివించాలని సూచించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో మనం రూపొందించుకున్న భారత రాజ్యాంగం, ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలకే దిక్సూచి అనడంలో సందేహం లేదన్నారు. భారతదేశంలో ఎన్నో మతాలు, కులాలు, జాతులు కలిసి మనుగడ సాగిస్తున్నాయంటే అది మన రాజ్యాంగం గొప్ప తనమన్నారు. అంతటి మహత్తరమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన డాక్టర్ అంబేద్కర్ గొప్ప మహనుబావుడన్నారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆ మహనీయుడికి ఘనంగా నివాళులు అర్పించాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ సమానత్వంతో కూడిన అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముందుకు పొవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బౌతు రాధ, జిల్లా నాయకులు రమ, బాగ్య, గుగులోతు కౌసల్య, దుర్గం పుష్పలత,నాయకులు స్వామి, రాజు, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.



# నేడు దీక్ష దివాస్ సన్నాహక సమావేశం... కేటీఆర్ రాక

**- మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**- పార్టీ ఫిరాయింపులే కడియం బ్రాండ్**

**- బిడ్డకు మంత్రి పదవి ఇస్తానంటే తండ్రి, బిడ్డ జంపు**

**- రాజీనామా చేయకు బహిష్కరణకు సిద్ధంగా ఉండు**

**- నాయిని దళితులను గోకుతున్నావు డప్పు కొట్టి దండోరా వేస్తాం**

**- మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య**



**హన్మకొండ,నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 26 నుండి డిసెంబర్ 9 వరకు 11 రోజులపాటు దీక్ష దివాస్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా నేడు హనుమకొండ జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రజా ప్రతినిధులు పాల్గొనే దీక్ష దివాస్ సన్నాహక సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నామని ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని కార్యకర్తలు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న విజయవంతం చేయాలని వినయ్ భాస్కర్ కోరారు. తన అవసరాలకు అనుగుణంగా పార్టీ ఫిరాయింపులే కడియం శ్రీహరి బ్రాండ్ అని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరి ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతూ రాజ్యాంగాన్ని, స్పీకర్ ను అవమానించే విధంగా తను రాజీనామా చేయను అంటున్నారు నువ్వు రాజీనామా చేయకు కడియం శ్రీహరి బహిష్కరణకు సిద్ధంగా ఉండు అన్నారు. తనకు తానే నీతిమంతుడు అని చెప్పుకునే కడియం శ్రీహరి దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నారని గ్రామాల్లో కనీసం తిరిగే పరిస్థితి లేదని అన్నారు. కడియం శ్రీహరి అంత నీతిమంతుడు అయితే రెండు సంవత్సరాలు చేసిన అభివృద్ధి పైన శ్వేత పత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకన్న మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. రిజర్వేషన్లు 50% మించ కూడదు అనే నిబంధన సుప్రీం కోర్టులో ఉంది అని తెలిసి బీసీలను మోసం చేసేందుకు హంగామా చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బిసి ప్రధాన మంత్రి కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయకుండా తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తానడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు హరి రమాదేవి, కార్పొరేటర్లు చెన్నం మధు, రంజిత్ రావు, సోద కిరణ్, జోరిక రమేష్, పులి రజనీకాంత్ , మేకల బాబు పాల్గొన్నారు.

# వయో వృద్ధులతో సంఘీభావ దినోత్సవం.. దుప్పట్లు శాలువాల పంపిణీ

**హన్మకొండ,నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** వయో వృద్ధులకు చేయూత అందించుట అభినంద నీయమని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి కే. జయంతి మరియు కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి వెంకన్న అన్నారు. సోమవారం రోజున ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ మరియు మనం మహిళా సంఘం ఆధ్వర్యంలో సుబేదారి లోని అసంత భవన్ ప్రాంగణం నందు వయో వృద్ధులకు సంఘీ భావ దినోత్సవాన్ని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిస్టర్ నిర్మల అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి కే. జయంతి మాట్లాడుతూ సమాజంలో మహిళలు, పిల్లల తర్వాత వృద్ధులే నిర్లక్ష్యానికి వివక్షతకు గురవుతున్నారని కుటుంబ సభ్యుల నిరాదరణ వలన వయోవృద్ధులు వారి హక్కులను కోల్పోతున్నార ని వారి హక్కుల సంరక్షణ కొరకు సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ యాక్ట్ మరియు ప్రభుత్వం అనేక కార్య క్రమాలు వారి సంక్షేమం కొరకు చేపడుతుందని తెలిపారు. ఒకవేళ వృద్ధులకు ఏమైనా సమస్య ఎదురైతే గ్రామాల లో ఏర్పాటు చేసిన వయో వృద్ధుల సంక్షేమ కమిటీకి సమాచారం అందించి నట్టయితే వారి సమస్యల పరిష్కారణ కొరకు తగిన సహాయము అందించడం మరియు అవసరమైన చర్యలు తీసుకో బడతాయని సూచించారు. ఈ సందర్భంగా వయో వృద్ధులకు దుప్పట్లు మరియు శాలువాలు పంపిణీ చేయడం చాలా అభినందనీయమని ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ వనం సంఘమును అభినందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి మరొక అతిథిగా విచ్చేసిన కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి వెంకన్న హాజరై మాట్లాడుతూ సమాజంలో అన్ని ప్రభుత్వ విభాగాలు వృద్ధుల సంక్షేమం కొరకు కలిసి పని చేయాలని కాబట్టి సమాజంలో ఉన్న ప్రతి పౌరులు వృద్ధులను గౌరవించడం మరియు వారి ఆలోచనలు వారి అనుభవాలను వారి వ్యక్తిగత సమాజ మరియు సమాజాభివృద్ధి కొరకు తీసుకోవడం చాలా ప్రాముఖ్యమైన విషయమని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమం నందు ముఖ్య రిసోర్స్ పర్సన్ గ వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకుల మధు హాజరై వృద్ధుల సంక్షేమంపై సందేశాన్ని అందించారు. సంస్థ ప్రాజెక్టు కో..ఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్ ట్రెజరర్ సిస్టర్ అమృత, నిర్వాహకులు సిస్టర్ ఆల్బర్ట్ స్టెపి లారెన్స్ మరియు వనం సంఘం అధ్యక్షురాలు లోరీర్ది మేరీ , కోఆర్డినేటర్లు యం. అజయ్ కుమార్, కె. రవి కుమార్ సుందరి, శ్రీకళ, అనిత రాజేశ్వరి, పూర్ణిమ తదితరుల తోపాటు 450 మంది వృద్ధులు పాల్గొనడం జరిగింది.



# బీసీలకు డిసిసి అధ్యక్ష పదవి పట్ల హర్షం

**• భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు**

**• తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ పెరుగు వెంకటరమణ యాదవ్, బీసీ ఉద్యోగుల జెఏసి రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి అడుగు అభినందనీయమని, ఖమ్మం డిసిసి అధ్యక్ష పదవి బీసీ వర్గానికి చెందిన నూతి సత్యనారాయణ గౌడ్ ను నియమించడం బీసీ వర్గాలకు గర్వకారణం అని, ముఖ్యంగా బీసీ వర్గాలకు రాజకీయ నాయకత్వంలో గౌరవప్రదమైన స్థానాలు కల్పించడం, భాగస్వామ్యం ఇవ్వడం పట్ల కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ పెరుగు వెంకటరమణ యాదవ్, బీసీ ఉద్యోగుల జెఏసి రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ... బీసీ వర్గాల అభివృద్ధి, రాజకీయ ప్రాతినిద్యం కోసం నిరంతరం పోరాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దూరదృష్టితో ఎన్ని అవాంతరాలేర్పడినప్పటికీ బీసీలకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి కల్పించడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ పెరుగు వెంకటరమణ యాదవ్, బీసీ ఉద్యోగుల జెఏసి రాష్ట్ర నాయకులు దేవరకొండ సైదులు, బీసీ జెఏసి చీఫ్ అడ్వైజర్ చేకూరి చైతన్య, బీసీ నాయకులు యాదాల నాగేశ్వరావు, నంద్యాల నరసింహారావు, నరేందర్, శ్రీపతి రామనాథం, సూత్రపు రాంబాబు, మండల రాకేష్, రావులపాటి శ్రీనివాస రావు, సూత్రాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై రాజకీయ వివక్షత దుర్మార్గం

**• జీవో 46 ప్రకారం బిసిలకు 22శాతం రిజర్వేషన్‌లను పట్టిష్టంగా అమలు చేయాలి • బీసీ రిజర్వేషన్లపై జిల్లా కలెక్టర్ పునర్ ఆలోచనచేసి న్యాయం చేయాలి • న్యాయం జరిగే వరకూ ఉద్యమిస్తాం • బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు ఆర్జెసి కృష్ణ, మేకల సుగుణారావు**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీలకు హామీ ఇచ్చారన్నారు. కోర్టు పరిధిలో ఉన్నందున జీవో నెంబర్ 46 ప్రకారం బీసీలకు 22 శాతం అమలు చేయకుండా 11.7 శాతం అమలుచేసేందుకు ప్రయత్నం చేస్తూ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు ఆర్జెసి కృష్ణ, మేకల సుగుణారావు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. జీవో 46 ప్రకారం బీసీలకు 22శాతం రిజర్వేషన్ ను అమలు చేయకుండా 11.7శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దారుణం అన్నారు. అన్ని రాజకీయ పక్షాలు బీసీ రిజర్వేషన్లపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. రఘునాథపాలెం, తిరుమలాయపాలెం మండలాల్లో సగానికి పైగా ఉన్న బీసీలకు ఒక్క రిజర్వేషన్ కూడా ప్రకటించకపోవడం దుర్మార్గం అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ బిసి రిజర్వేషన్లపై పునర్ ఆలోచన చేసి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీలకు 22 శాతం అమలయ్యేంతవరకు న్యాయపోరాటం చేస్తామని వారు డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బిసి జేఏసీ నాయకులు, పిట్టల నాగేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, పెరుగు వెంకటరమణ యాదవ్, కొలిచెలం గీత, చల్ల హనుమంతు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్ధికాభివృద్ధికి వడ్డీలేని ఋణాలు...

**• కరీంనగర్ నియోజక వర్గం లోని మహిళా సంఘ సభ్యులకు మంజూరైన కోటి ఇరవై ఆరు లక్షల చెక్కు అందజేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే**






**కరీంనగర్,నవంబర్25(పీసీబ్ల్యూ న్యూస్):** మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఏంపిడివో కార్యాలయంలో కరీంనగర్ నియోజక వర్గంలోని మహిళా సంఘ సభ్యులకు మంజూరైన వడ్డీలేని ఋణం ఒక కోటి ఇరువై ఆరు లక్షల చెక్కును సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని వడ్డీలేని ఋణాలు మంజూరు చేసి ఆదుకుంటుందని ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగిందని, మహిళా సంఘాల తరపున ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం జరుగుతుందని ఈ విధంగా అనేక రకాలుగా మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ లో కరీంనగర్ జిల్లాను రాష్ట్రంలోనే ముందుండేలా కృషి చేస్తున్నామని ఈ రుణాలు సక్రమంగా వినియోగించి మహిళలు ఆర్థికంగా ఎదిగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో మహేశ్వర్, డిపిఎం తిరుపతి,ఎంపిడివో సంజీవ రావు,ఏపిఎంలు,సిసి లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణం - విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

**నమ్మించి మోసం చేస్తున్నారు**

**రెండు గదులు, ఇంటి స్థలం కొనుక్కొని 14 లక్షలు మోసపోయాం**

**విలేకర్ల సమావేశంలో బాధితుడు పావులూరి వెంకటేశ్వర్లు**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరం మధురానగర్ 3వ లైన్లో ఎన్ఎస్పి కాలవకట్టపై మండే వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఎన్ఎస్పి స్థలాన్ని ఆక్రమించి డాక్యుమెంట్లు, ఫ్లాట్ నెంబర్ లేకుండా ఇండ్లు నిర్మించి విక్రయించేందుకు నమ్మించి 14 లక్షలు మోసం చేశారని పావులూరి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2005 లో 150 గజాల స్థలాన్ని 2-233/7 ఇంటి నెంబర్ పేరుతో 1032 గజాలు కుటుంబ సభ్యుల పేరుతో ఆక్రమించి తప్పుడు దృపత్రాలు సృష్టించి, ఇండ్లు కట్టించి అమ్మకానికి పెట్టి మండే వెంకటేశ్వర్లు, ఆయన కుటుంబ సభ్యులు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించాడు. అందులో భాగంగానే సర్వేనెంబర్ 412లో 168.81 గజాల స్థలంలో రెండు గదులు ఇల్లు నిర్మించి తన భార్య పేరుతో 2013లో 14 లక్షలకు అమ్మాడని వాపోయారు. ఎన్ఎస్పి అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారని అందులో నేను కొనుగోలు చేసిన ఇల్లు కూడా కూల్చివేసారని తెలిపారు. ఇట్టి విషయంపై మున్సిపల్ అధికారులు, జిల్లా కలెక్టర్ లకు ఫిర్యాదు చేశామని చెప్పారు. మండే వెంకటేశ్వర్లు అతని కుటుంబ సభ్యులు చేసే మోసాలను ప్రజలు గమనించి ఎవ్వరూ కూడా అటువంటి ఇంటి స్థలాలు, ఇండ్లను కొనుగోలు చేసి మోసపోవద్దని పేర్కొన్నారు. ఎన్ఎస్పి, మున్సిపల్ అధికారులు, జిల్లా కలెక్టర్.. ఎన్ఎస్పి భూముల్లో అక్రమ నిర్మాణాలు, విక్రయాలపై విచారణచేసి వారిపై కఠిన చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో జాలాది రవికుమార్ పాల్గొన్నారు.

# ఇది పవిత్ర దేవాలయమా లేక ద్విచక్ర వాహనాలు, చెప్పుల షాపులకు నిలయమా అని మండిపడుతున్నారు భక్తులు?

**చిత్తం శివుని మీద భక్తి చెప్పుల మీద ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారంటున్నారు స్థానికులు?.**

**- తొర్రూరు పట్టణంలో ఒక పుణ్యస్థలం ఇది.**

**మాటలతో చెప్పలేని దారిలో తిరుగుతూ ద్విచక్ర వాహనాలు, పాదరక్షలు అయ్యప్ప దేవాలయం వరకు ఎలా వస్తాయి?.**

**ఇంత జరుగుతున్న చోద్యం చూస్తున్న పూజారులు అంటున్నారు మాల ధారణ భక్తులు?.**







**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 25(పిసీడబ్ల్యూ న్యూస్):** భక్తులకు కొంగు బంగారంలా కోరిన కోరికలు తీర్చే దేవాలయాలలోని దేవుళ్ళను ఒకే ప్రాంతంలో దర్శించుకోవటం చాలా అరుదుగా కనిపిస్తాయి. దేవాలయాలను దర్శించుకునేందుకు భక్తులు ఎంతో పవిత్రంగా తయారై వారు కొలిచే దేవుళ్లను దర్శించుకునేందుకు దేవాలయానికి వస్తే ఇక్కడ పుణ్యానికన్నా పాపం ఎక్కువగా అన్నట్లు ప్రధాన గేటు ముందు పాదరక్షలు( చెప్పులు) దర్శనమిస్తూ ఉంటాయని అది కాక ఊరంతా మురికి కంపులో తిరిగిన వాహనాలు దేవాలయం ప్రాంగణంలోకి రావడంతో పాదాలను శుభ్రం చేసుకున్న అపవిత్రమైన దారి నుండే గర్భగుడిలోకి పూజారులు వెళ్ళటం దర్శించుకునేందుకు భక్తులు రావడం ఎక్కడుంది పవిత్రత అంటూ కొందరు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది దేవాలయమా వాహనాలు నిలిపేందుకు,పా దరక్షలు దాచుకునేందుకు నిలయము అంటూ మండిపడుతున్నారు. దేవాలయాలలో ఇప్పుడు అయ్యప్ప భక్తులు ఎంతో శ్రద్ధగా స్వామియే శరణమయ్యప్ప అంటూ పాదరక్షలు లేకుండా దేవాలయంలోకి వచ్చేముందే వారి పాదాలను శుభ్రం చేసుకుని దేవాలయంలో భజన కార్యక్రమాలు చేస్తుంటారు. మీరు ఇక్కడ ఒక దృశ్యాన్ని గమనించండి. పవిత్రమైన అయ్యప్ప దేవాలయం ఎదురుగా చెప్పులను ఎవరు ఎత్తుకు పోతారని అని అయ్యప్ప దేవాలయం ముందు కూడా వారి వాహనంతో పాటు చెప్పులను తీసుకువచ్చారంటే వారి భక్తి ఎక్కడ ఉందో అర్థం చేసుకోవచ్చు అంటున్నారు భక్తులు?.అవసరానికి వాడుకొని చెత్త కుప్పలో పడేసిన ఊరేగింపు రథం అదే ప్రాంతంలో దేవాలయంలో శు భ్రం చేసిన చెత్త,పూజలు చేసిన పూలదండలు ఇతర సామాన్లు వాడి పడేసే కవర్లు గోడ పక్కనే వేయటం పరిసరాలను పరిశుభ్రం ఉంచేలా చూసే బాధ్యత పూజారులకు ఉన్నప్పటికీ దేవాలయ ప్రాంగణంలో కంపు కొడుతున్న పట్టించుకోకపోవడం ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు కొందరు?. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని పాటి మీది దేవాలయాలలో ప్రతి నిత్యం అపవిత్రంగా కనిపిస్తున్న వాతావరణం ఇది. ఈ విషయాలపై పూజారులు వాహనాలను, పాదరక్షలు అనుమతించకుండా వచ్చే భక్తులకు ప్రతినిత్యం చెప్పటం కుదరదని ఒక ఫ్లెక్సీలు తయారుచేసి గేటు ఎదురుగా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దేవాలయాలకు వచ్చిన వారికి గేటు ఎదురుగానే చెప్పుల షాపులా పాదరక్షలు దర్శనం ఇస్తున్నాయని వారి ఆవేదనను వెళ్లబుచ్చారు?.

# రైతు శ్రేయస్సు కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రం





**చిలుక్కోయాలపాడులో ప్రారంభించిన ఎమ్మెల్యే రాంచందర్ నాయక్**

**క్వింటాకు రూ.500 బోనస్‌తో రైతును ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమే**

**సిరోలు, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, సిరోలు మండలం, చిలుక్కోయాలపాడులో రైతు శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ 'ధనలక్ష్మి' వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మాట్లాడుతూ... చిలుక్కోయాలపాడులో నూతనంగా ఏర్పాటుచేసిన ధనలక్ష్మి వరిధాన్యం కొనుగోలు కేంద్రం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, రైతులందరూ సుదూర ప్రాంతానికి వెళ్లి ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరంలేదని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతు ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతుకు అతి దగ్గరలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికే ప్రాధాన్యతనిస్తున్నదని అన్నారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పేదలకోసం ఒక్క చిలుక్కోయాలపాడులో ఒక్క ఇల్లుకూడా కేటాయించలేదని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే గ్రామంలో 20 ఇళ్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. ఇంకా గ్రామంలోని పేదల కోసం వచ్చే 3 సంవత్సరాల్లో 60 ఇళ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం ప్రజల్లోకి వెళ్లిందని అన్నారు. ముఖ్యంగా రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదవారికి సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి నిర్ణయాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలే అన్నారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు తమ ధాన్యాన్ని అమ్మి లాభం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊడుగుల వెంకన్న, సీరోల్ మండల ఎమ్మార్వో పొన్నం చందర్, మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బుడిగం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగటి ఉప్పలయ్య ,మండల కోఆర్డినేటర్ కాలం రవీందర్ రెడ్డి, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, గ్రామ మాజీ వార్డ్ సభ్యులు, రైతులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయండి

**జిల్లాలోని 12 మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు**

**ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా అమలు చేయాలి**

**నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ కలెక్టరేట్ నుండి నోడల్ అధికారులు, అన్ని మండలాల ఎంపీడీవోలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్**

**హన్మకొండ, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని 12 మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ నున్నాయని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్నీ ఏర్పాట్లను అధికారులు సిద్ధం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీపీ వో లక్ష్మి రమాకాంత్, ఇతర అధికారులతో కలిసి నోడల్ అధికారులు, ఎంపీడీవో లతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావు లేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాలని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. నిఘా బృందాలను నియమించి, పకడ్బందీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను ఎక్కడికక్కడ నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల పంపిణీపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, ఎక్కడైనా సదుపాయాలు లేకపోతే యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్ వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల జాబితాను మరోమారు పరిశీలించు కోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువు గా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అను గుణంగా పూర్తి పార దర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడి పడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో ఆర్డీఓ లు నోడల్ అధికారులు, డీ.ఎల్.పీ.ఓలు పాల్గొన్నారు.

# ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర

**● కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**



**కల్లూరు, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరలు 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు పంపిణీ చేపడుతుందని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అన్నారు. మండల పరిధిలో కొర్లగూడెం గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళలకు అందజేశారు. అధికారులు సమన్వయముతో గ్రామంలో ప్రతి మహిళకు చీర అందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక అన్నలాగా సారె చీరను సాక్షాత్తు సబ్ కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవటం చాలా సంతోషంగా ఉందని మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాంప్రసాద్,కంచపోగు పుల్లయ్య,లింగపోగు నాగమణి, చాట్ల సౌందర్య మహిళలు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు

**ఇందీరా మహిళ శక్తి చీరల పంపిణి**

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్**



**తల్లాడ,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎటువంటి తారతమ్యా భేదాలు లేకుండా అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు వర్తిస్తున్నాయని మండల పార్టీ అధ్యక్షులు ఏఎంసి వైస్ చైర్మన్ కాపా సుధాకర్ అన్నారు. మండల పరిధిలో గొల్లగూడెం గ్రామంలో మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులకు సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ఆదేశానుసారం కాపా సుధాకర్ ఆధ్వర్యంలో చీరలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజల జీవితాలు కాంగ్రెస్ పార్టీతోనే మారుతాయి అని రాష్టంలో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజలు తీసుకొచ్చారని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆశించినట్లుగానే పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నాం అని అన్నారు. అర్హులందరికి రేషన్ కార్డులు,ఉచిత విధ్యుత్,ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.గత టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు తేడా ప్రజలు గమనించాలని కోరారు.కోటి మంది మహిళలను కోటిశ్వర్లను చేయాలని రేవంత్ రెడ్డి ధృఢ సంకల్పంతో పని చేస్తున్నారు.మహిళ సోదరిమణులను ఆర్థింకంగా బలోపేతం చేసేందుకు మహిళ సంఘాలకు వడ్డి లేని ఋణాలు,మహిళ సంఘాలకే స్వయం ఉఫాధి అవకాశం ప్రజా ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.మన సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివ్రృద్ధి పథంలో నడిపేందుకు మన ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఎన్నో విధాలుగా కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇసినేపల్లి వెంకటేశ్వర్లు, డ్వాక్రా మహిళా సంఘాల వారు, వెంకటేశ్వర్లు మహిళా సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై తల్లులకు అవగాహన: సిడిపిఓ నిర్మల జ్యోతి





**తల్లాడ,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలో అన్నారుగూడెం గ్రామపంచాయతీలో అంగనవాడి నాలుగ వ సెంటర్ నందు మంగళవారం సిడిపిఓ నిర్మల జ్యోతి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ తల్లులకు సీజన్లో వచ్చే వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేసినారు. అంగనవాడి కేంద్రంలో పిల్లల బరువులు తీసి వారు ఏ స్థాయిలో ఉన్నారు అన్న విషయంపై బరువు తక్కువగా ఉంటే ఎన్ఆర్సి కి ఎలా రిఫర్ చేయొచ్చు అక్కడ ఇచ్చే ఆహారం గురించి అంగన్వాడి సెంటర్లో బాలామృతం ప్లస్ ఎలా ఇవ్వాలి,ఎంత ఇవ్వాలి, దానివల్ల వచ్చే ప్రయోజనాలు వివరించడం జరిగింది. తల్లులకు మన ఇంటి ఆవరణంలో మనకు అనుకూలంగా ఉన్న ప్రదేశం లో ఆకుకూరలు, కాయగూరలు పెరటిలో పెంచుకునే పండ్ల మొక్కలు ఎలా పెంచుకోవాలి అనే విషయం పై అవగాహన కల్పించారు. అంగన్వాడీ సెంటర్లో ప్రీ స్కూల్ విద్యా బోధన ఇంగ్లీష్ మీడియం నర్సరీ ఎల్కేజీ యూకేజీ పిల్లలకు ఇచ్చే వర్క్ బుక్స్ పిల్లలతో ఎలా రాయిస్తున్నారు తల్లులకు వివరణాత్మకంగా తెలియజేశారు. ఏసీడీపీఓ నవ్య రత్నమ్మ, సూపర్వైజర్ సత్యవతి, ఏఎన్ఎం విజయలక్ష్మి, రాంబాయి పిల్లల తల్లులు పెద్దలు గ్రామస్తులు,ఆయా జ్యోతి పాల్గొన్నారు.

# ఇది ప్రజా ప్రభుత్వం: ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమై దయానంద్







**సత్తుపల్లి,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహిళలని కోటీశ్వరులు చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ఇది ప్రజా ప్రభుత్వం మహిళల, రైతుల పక్షపాతి ప్రభుత్వమని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మంగళవారం సత్తుపల్లి ఎమ్మార్ గార్డెన్లో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించి 4,67,35,000 రూపాయల చెక్కులను అందజేశామని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనంగా మరోసారి రాష్ట్రంలోని మూడు లక్షల 50 వేల స్వయం సహాయక మహిళా సంఘాలకు 304 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందించనున్నది. ఇందుకుగాను ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ లేని రుణాలను మూడో విడత అందించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు వడ్డీ లేని రుణాలను ఇచ్చిన విషయం తెలిసిందే. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని, వారి కాళ్ళ మీద వారిని నిలబడేలా తీర్చిదిద్ది కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటామన్న ప్రజా ప్రభుత్వ హామీ మేరకు మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు కల్పిస్తున్నది అని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు, ఉచిత కరెంటు,500 రూపాయలకు గ్యాస్,ఇందిరమ్మ ఇల్లు, వడ్డీ లేని ఋణం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పథకాలు అందుతున్నాయి అని తెలిపారు. మహిళా సంఘాల కు పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పనిని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అప్పగించింది. బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను కల్పించడం, ఇటీవల కాలంలో పెట్రోల్ బంకుల నిర్వహణను కూడా మహిళలకు అప్పగించింది. అంతేకాక ప్రతి జిల్లా కేంద్రంలో ఎంపిక చేసిన ప్రాంతాలలో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయడమే కాకుండా, వికలాంగులు, జెండర్ సమస్యల కోసం సామాజిక కార్యక్రమాల నిర్వహణను, గ్రామ సంఘాలకు, మండల సమాఖ్యలకు భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం కల్పిస్తున్నది అని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రతి సంవత్సరం మహిళలకు వడ్డీ లేని రుణాలను పెద్ద మొత్తంలో ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్, కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి,ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు,సత్తుపల్లి నియోజకవర్గం 5 మండలాల తహసిల్దార్ లు,ఎంపీడీవో లు,ఎంఎస్ లు,ఏపిఎం లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్ బాబు,కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు,జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు: ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్



**పెనుబల్లి,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని సత్తుపల్లి శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాఘమై దయానంద్ అన్నారు. మంగళవారంసీతారాంపురం గ్రామంలో అక్కసాని వంశీ,లత ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొని లబ్ధిదారులకు సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి,రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు ఇచ్చి ఆదుకుంటుందని ఎవరు అధైర్య పడవద్దు అని అన్నారు. సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్,నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాధ్, టేకులపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాధవ రెడ్డి,మాధవ్,కర్రీ వెంకటేశ్వరరావు,కర్రీ కమలాకర్,బొర్రా కోటేశ్వరరావు, పెనుబల్లి మండలం కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,సీతారాంపురం ఇందిరమ్మ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, కాలనీ ప్రజలు,నాయకులు పాల్గొన్నారు.

# పోలీసులు సత్వరమే సేవలందించాలి



**పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**

**కల్లూరు ఏసిపి ఐపీఎస్ వసుంధర యాదవ్**



**వేంసూర్,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో పోలీస్ స్టేషన్ గడపతొక్కిన ప్రతి పౌరునికి పోలీసులు సత్వరమే సేవలందించాలని కల్లూరు ఏసిపి ఐపీఎస్ వసుంధర యాదవ్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ను ఏసిపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఈ సందర్భంగా ఆమె స్టేషన్ రికార్డులన్నింటినీ సమీక్షించారు. పోలీసులు ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న వాహనాలను తనిఖీ చేశారు. సిసిఎన్టిఎస్ 2.0,ఇ-సమన్స్,టీఎస్ సిఓపి లను ఖచ్చితంగా ఉపయోగించాలని సిబ్బందిని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎఫ్ఐఆర్‌లను పరిశీలించి చురుకైన పోలీసు సేవలు అందించాలని కోరారు. రౌడీషీటర్లు, హిస్టరీ-షీటర్లపై నిఘా ఉంచాలని బృందానికి సూచించారు. పోలీసులు ఎప్పటికప్పుడు సమర్థవంతమైన క్షేత్ర పర్యవేక్షణ కోసం కానిస్టేబుళ్లను విలేజ్ పోలీస్ ఆఫీసర్లుగా నియమించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ను ఆదేశించారు. మండలములో స్థానిక నిఘాను బలోపేతం చేయడానికి సిసి టివి కెమెరాల ఏర్పాటుపై సమాజంలో అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని ఏసీపీ సిబ్బందిని ఆదేశించారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరగా రికవరీ చేయాలని ఆమె ఉద్ఘాటించారు. అనంతరం ఏసిపి ధాన్యం చెక్‌పోస్ట్‌ను సందర్శించి పోలీసులు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

# కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రదర్శన







**సత్తుపల్లి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కార్మిక చట్టాలను కాలరాస్తు నాలుగు లేబర్ కోడ్ లను అమలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్ కె ఎం ) పిలుపు మేరకు సత్తుపల్లిలో మంగళవారం నీలం రామచంద్రన్ భవనం నుంచి రింగ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది.రింగ్ సెంటర్ లో జరిగిన కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు బీరెల్లి లాజరు, సిపిఐ జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు సామేలు మాట్లాడుతూ బిజెపి అధికారంలో వచ్చినప్పటి నుంచి రైతుల పట్ల కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తుందని దాంట్లోభాగంగానే రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కార్మికులు కష్టపడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నేడు నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడం కోసం తీవ్రమైన ప్రయత్నం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని మొత్తాన్ని నేడు కార్పొరేట్ సెక్టార్లకు అప్పజెప్పి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవడం కోసం చూస్తున్నదని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, భారత దేశం పై అమెరికా 50%సుంకం విధించడాన్ని ఎదురుకోవాలని పత్తి పాడి పరిశ్రమ రంగాలలో స్వేచ్ఛ వాణిజ్యం రద్దు చేయాలని పత్తిపై 11% సూపర్ సుంకాన్ని రద్దు చేసిన నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అఖిలభరత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు ఒగ్గు నాగిరెడ్డి, బొజ్జ విశ్వనాథం, టీ యూ సి ఐ నాయకులు చెన్నారావు, సత్యం,ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు అలివేలు, భద్రమ్మ, పద్మ, రాధ కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు, చాల్లగుల్ల కృష్ణయ్య, ఐ. శ్రీను,రామకృష్ణ, సిపిఐ నాయకులు యోబు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**విద్యార్థుల నైపుణ్యానికి కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం**

**10వ తరగతి ప్రాక్టీస్ పరీక్షలు రాయడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది**

**మధిరలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న బోజనం చేసిన జిల్లా కలెక్టర్**







**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, మంచి ఆరోగ్యం ఉంటేనే పిల్లలు చదువు మీద శ్రద్ధ చూపెడతారని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం మధిర నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. మధిర మండలంలోని క్రిష్టాపురంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంను కలెక్టర్ సందర్శించారు. పరిసరాలను తిరుగుతూ, పడకగదులు, బాత్ రూంలు, త్రాగునీరు, వంటగదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం ఏలా ఉంటుంది, రుచిగా కూరలు పెడుతున్నారా, మెనూ ప్రకారం భోజనం, గుడ్డు, చికెన్ కర్రీ వడ్డిస్తున్నారా, పప్పు, సాంబారు నాణ్యంగా ఉంటున్నాయా అని కలెక్టర్ భోజనం చేస్తూ, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత 10వ తరగతి గదిలో విద్యార్థులకు పరీక్షలకు సంసిద్ధంగా ఉండేందుకు పలు సూచనలు చేశారు.అనంతరం మునగాల కృష్ణాపురంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టిక, రుచికరమైన ఆహారం అందించాలని, నాణ్యతలో ఏలాంటి లోపం ఉండవద్దని అన్నారు. గురుకుల పాఠశాలలో అందించే ఆహారంతో మంచి ఆరోగ్యంతో విద్యార్థులు చదువు పై దృష్టి పెడతారని వివరించారు. మనకు లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యానికి కృషి తోడైతే అద్భుత విజయాలు సాధ్యం అవుతాయని అన్నారు. 10వ తరగతి మెయిన్ పరీక్షల కంటే ముందు వీలైనంత మేర అధిక సంఖ్యలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షలు అధికంగా రాయడం వల్ల తుది పరీక్షలను ఎటువంటి ఒత్తిడి లేకుండా సులభంగా రాయగలుగుతామని అన్నారు. మనం చదివిన దానికంటే రాసిన అంశాలు అధికంగా గుర్తుండిపోతా యని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల చదివే సామర్థ్యం పెంపు చేయడం కోసం చేపట్టిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి భోదన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఇవో దీక్షా రైనా, మధిర తహసీల్దారు రాంబాబు, హెడ్ మాస్టర్ రాములు, సైదులు, టీచర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బొంతు వెంకటేశ్వరరావును పరామర్శించిన ముువ్వా



**వేంసూరు, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో జయ లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొంతు వెంకటేశ్వరరావు ను మంగళవారం తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు పరామర్శించారు.ఈ సందర్భంగా బొంతు ను ఆరోగ్య రీత్యా పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**

**ఎన్నికల సన్నద్ధతపై నోడల్ అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బంది ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, స్థానిక సంస్థల ఎన్నికల నోడల్ అధికారులతో మంగళవారం ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎఫ్ఎస్ టి టీములు, జోనల్ అధికారులు, రూట్ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణకు కావాల్సిన వాహనాల ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల ఆవశ్యకత ను బట్టి ఏర్పాట్లు ఉండాలన్నారు. రవాణా, విద్యాశాఖ, పంచాయతీ శాఖలు వాహనాల ఏర్పాట్లపై సమన్వయం చేసుకోవాలన్నారు. ఎఫ్ఎస్ టి, ఎస్ఎస్ టి లకు సంబంధించి 15 బృందాల ఏర్పాటు చేయాలన్నారు. మండల అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకొని బృందాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది భోజనాలు, టిఏ లపై ఖర్చుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. ఎంసిఎంసి కమిటీ ఏర్పాటు చేది, ఖర్చుపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నోటిఫికేషన్ నాటి నుండి ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల సామాగ్రి సేకరణ పూర్తిచేయాలన్నారు. పీవో, ఏపీవో ల ర్యా%శీ%డమైజేషన్ ప్రక్రియ నిబంధనల మేరకు చేపట్టాలన్నారు. శిక్షణా కార్యక్రమాలు పకడ్బందీగా పూర్తిచేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కేంద్రంలో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ ముద్రణకు చర్యలు తీసుకోవాలని, అవి ఎట్టి పరిస్థితుల్లో బయటకు పోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలన్స్ బృందాలు మరింత విస్తృతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీఓ ఏ. పద్మశ్రీ, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, ఎంవిఐ వెంకటరమణ, సిపిఓ ఏ. శ్రీనివాస్, ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, డిసిఓ గంగాధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మహా పడిపూజలో ముువ్వా










**వేంసూరు, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో జయలక్ష్మీపురం గ్రామానికి చెందిన గడిపర్తి చలపతి రావు స్వామి మాల ధరించిన సందర్భంగా మంగళవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు పాల్గొన్నారు. అనంతరం పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామంలో సుబ్రమణేశ్వర షష్టి సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొని సుబ్రమణేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకమైన పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ పెద్దలు,అయ్యప్ప స్వాములు,భక్తులు పాల్గొన్నారు.

# చక్రవర్తి హాస్పిటల్‌లో దారుణం...

- డాక్టర్ల నిర్లక్ష్యానికి రోగి మృతి
- సర్జరీ చేసి ఐసీయూకు కాకుండా జనరల్ వార్డుకు తరలించిన వైద్యులు
- రోగి మృతి..బంధువుల ఆందోళన
- నిత్యం ఇలాంటి సంఘటనలే పునరావృతం
- రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆసుపత్రి నిర్వహకులు
- ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న ఆసుపత్రి నిర్వహకులు
- పట్టించుకోని వైద్య అధికారులు



**హన్మకొండ,నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హన్మకొండలోని చక్రవర్తి హాస్పిటల్ లో దారుణం చోటుచేసుకుంది. డాక్టర్ల నిర్లక్ష్యానికి ఆత్మకూరు గ్రామానికి చెందిన టీగర్ బాలమణి అనే మహిళ మృతి చెందింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు హాస్పటల్ ఎదుట ఆందోళన చేపట్టారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే తమ తల్లి చనిపోయిందని మృతురాలు కుమారుడు శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్జరీ చేసి ఐసీయూలో పెట్టకుండా జనరల్ వార్డులో ఉంచడం వల్లనే తమ తల్లి మృతి చెందిందని పేర్కొన్నారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి తమకు డబ్బులు ఇస్తానని ఆశ చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు ఆస్పత్రిలో సర్వసాధారణం అయిపోయింది అని రోగులు ఆరోపిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా హాస్పిటల్ యాజమాన్యం పని చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్ని సంఘటనలు జరిగినా ఎంతమంది మరణించిన హాస్పటల్ యాజమాన్యం మాత్రం మారడం లేదని తన ఇష్ట రీతిన లక్షల కొద్ది డబ్బులు వసూలు చేస్తూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికే పలుసార్లు వైద్య అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చక్రవర్తి హాస్పిటల్ పై తగు చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పీసీడబ్ల్యూ న్యూస్‌కు స్పందన

- ఈ బురద రోడ్డు బాగు చేయండి...ఇందిరా కాలనీ వాసులు
- అనే శీర్షికతో వ్రాసిన వార్తకు స్పందించిన ఎంపీడీఓ


PCW

ఈ బురద రోడ్డు బాగు చేయండి: ఇందిరా కాలనీవాసులు





**ఖానాపూర్ నవంబర్ 25,(పీసీడబ్ల్యూ న్యూస్):** ఖానాపూర్ మండలంలోని అశోక్ నగర్ సోమవారం పీసీ డబ్ల్యూ దినపత్రిక లో వ్రాసిన వార్తకు స్పందించిన ఎంపీడీఓ అద్వైత వెంటనే ఆ సమస్య ను గుర్తించి సంబందించిన గ్రామ కార్యదర్శి కీ చెప్పి ఆ సమస్య ను పరిష్కరించినందుకు అశోక్ నగర్ ఇందిరా కాలనీవాసులు ఎంపీడీఓ కీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రేపు పోటు ప్రసాద్ వర్ధంతి సభ

**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దివంగత సిపిఐ నాయకుడు, సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభఈనెల 27న ఉదయం 10 గంటలకు ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకునిగా అనేక విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించిన పోటు ప్రసాద్ ఆ తర్వాత ఏఐటియుసి నాయకునిగా కార్మిక వర్గం సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పనిచేసిన పోటు ప్రసాద్ తుదిశ్వాస వరకు నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేశారని సురేష్ తెలిపారు. ఆయన కృషి, పట్టుదలను - స్మరించుకుని ఆశయ సాధనకు పునరం కితమయ్యేందుకు ప్రథమ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోటు ప్రసాద్ స్మారక స్తూపం గల బోనకల్ రోడ్, ఇందిరా నగర్ వద్ద ప్రత్యేక కార్యక్రమాలు చేయనున్నట్లు సురేష్ తెలిపారు.

**అభ్యుదయ రచనలకు ఆహ్వానం** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఒక ప్రత్యేక సావనీరన్ను విడుదల చేయనుంది. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం, ఉమ్మడి ఖమ్మం పోరాటాలు, గ్రామీణ నేపథ్యం, కళలు, సంస్కృతి, సాంప్రదాయాలకు సంబంధించి అభ్యుదయ విప్లవ కవితలను, పాటలను ఆహ్వానిస్తున్నది. డిసెంబర్ మొదటి వారంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రపై కవి సమ్మేళనం కూడా నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు ప్రముఖ కవి లెనిన్ శ్రీనివాస్ ను సంప్రది ంచగలరు. రచనలను లెనిన్ శ్రీనివాస్ 9959852154కు పంపవచ్చునని కన్వీనింగ్ కమిటీ బాధ్యులు లెనిన్ శ్రీనివాస్, రౌతు రవి, కొంపల్లి రామయ్య, గోపిశెట్టి వెంకటేశ్వరరావు లు తెలిపారు.

# ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న యువకులు : సిఐ బాలకృష్ణ



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. మంగళవారం నగరంలోని రాపర్తి నగర్ లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు ముగ్గురు యువకులు ఒక మోటార్ సైకిల్ పై వస్తూ పోలీసుల చూసి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ ముగ్గురు కలసి గత కొంతకాలంగా చెడు వ్యసనాలకు బానిసలై చదువు మానేసి స్నేహితుల వెంట తిరుగుతూ మోటార్ సైకిల్ దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. గత రెండు నెలల్లో ఖమ్మం రెండవ పట్టణ, ఖానాపూర్ హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం ఐదు మోటర్ సైకిల్ దొంగతనాలు చేశారని తెలిపారు. ఈ ముగ్గురు యువకులు కూడా మైనర్లని పేర్కొన్నారు. వారి నుండి ఏడు లక్షల విలువచేసే ఐదు మోటర్ సైకిల్లు రికవరీ చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు ఇన్స్పెక్టర్ బాలక్రిష్ణ వివరించారు.

# బీసీ జెఏసీ ఖానాపురం మండల కమిటి ఏకగ్రీవం



అధ్యక్షులు



ప్రధాన కార్యదర్శి



ముఖ్య సలహాదారులు

**ఖానాపురం నవంబర్ 25 : (పీసీడబ్ల్యూన్యూస్):** ఖానాపురం మండల కేంద్రంలో బీసీ జెఏసీ గౌరవ సలహాదారులు వల్లే శ్రీనివాస్ ,కొరే సుధాకర్ ,లింగిడి వెంకటేశ్వర్లు ,రాధారపు అశోక్ ల అద్వర్యంలో బీసీ జెఏసీ ఖానాపురం మండల కమిటి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.బీసీ జెఏసీ ఖానాపురం మండల అధ్యక్షుడు – బందారపు శ్రీనివాస్ గౌడ్ ,ప్రధాన కార్యదర్శి – వీరమల్ల రాములు ,ఉపాధ్యక్షులు – నోముల నరేష్ లెంకలపల్లి రవికుమార్ నాంచారి కుమార్ ,సహాయ కార్యదర్శులు – గొడుగు ఐలోని ముద్దంగుల సంపత్ కొడిమ్యాల యాకస్వామి ,కోశాధికారి– కోడి అశోక్ కార్యవర్గ సభ్యులు :చిట్టబోయిన ప్రవీణ్ ,కోరెరాము ,మల్లం దర్గయ్య ,ములుకుంట్ల యాకన్న ,పోతరాజు కుమార్ ,రాగం సతీష్ ,బొమ్మెర మునేందర్ ,రేపాక సురేష్ , బొళ్ళు మురళి ,భూషబోయిన రాజు ,పులిగిల్ల నాగరాజు ,అనబత్తుల విజయ్ ,నార్లపురం పాపయ్య ,తాళ్ళపెల్లి కమాలకర్ , ఎల్ది భాస్కర్ లతో పాటు మరికొంతమంది ని ఎన్నుకోవడం జరిగింది.

## బిజెపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పురె ల్ల శ్రీకాంత్ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన కేంద్ర హెూం మంత్రి బండి సంజయ్





**రామడుగు, నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ రామడుగు మండల శాఖ ప్రధాన కార్యదర్శి పురేళ్ల శ్రీకాంత్ గౌడ్ సోమవారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించరాని వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించానా కేంద్ర హెూంశాఖ మంత్రి వర్యులు కరీంనగర్ ఎం.పి బండి సంజాయ్ కుమార్ ఆయనతోపాటు బిజెపి జిల్లా మండలనాయకులు ప్రభాకర్ యాదవ్ మెడి రవీందర్ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

# ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి

● ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి నవంబర్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ దరఖాస్తుల పరిష్కారం, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్సులతో మంగళవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు, లే అవుట్లు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ ద్వారా ప్రజలకు అవకాశం కల్పించిందని తెలిపారు. దీంతో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నగరంలో రోడ్లను, ఫుట్ పాత్ లు ఆక్రమించడం జరగకుండా నిత్య పర్యవేక్షణ చేయాలని తెలిపారు. భవన నిర్మాణాలు ప్లాన్ ప్రకారం కాకుండా డీవేయేషన్ చేసి నిర్మాణాలు చేపడుతున్న వాటిని ప్రాథమిక దశలోనే అడ్డుకోవాలని తెలిపారు. అలాగే అనధికారిక ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకుండా చూడాలని అన్నారు. పెండింగ్ ఉన్న ప్రకటనల పన్నులు వసూలు చేయాలని అన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్, బి.పి.ఎస్ను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఏసీపీ లు మూర్తి, మధు, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, మేనేజర్ హాసిమ్, టి.పి.ఎస్. వంశి, టిపిబివో లు, ప్లానింగ్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# అసభ్యకరమైన మాటలతో విద్యార్థులపై వేధింపులు

**అధ్యాపకుల పైన క్రిమినల్ కేసులు పెట్టాలి**

**నారాయణ విద్యాసంస్థలకు ఖమ్మంజిల్లా విద్యాశాఖ అధికారి వత్తాసు..?**

**విద్యార్థుల సమస్యలను పట్ల నిర్లక్ష్యం**

**పి.డి.ఎస్.యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాలేజీ ముందు ధర్నా**




**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లాలోని నారాయణ విద్యాసంస్థల అక్రమాలపై పి.డి.ఎస్.యూ ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా మండిపడింది. నారాయణ, విద్యా సంస్థలు విద్యార్థులకు పాఠాలు బోధించే కొంతమంది అధ్యాపకులు అసభ్యకరమైన, అవమానకరమైన మాటలతో విద్యార్థులను వేధించడం, కాలేజీకి అనుమతులు లేకుండా అడ్మిషన్లు ఒకచోట చేసి, తరగతులు మరొకచోట నిర్వహించడం, విద్యా చట్టాలను బహిరంగంగా ఉల్లంఘించడమేనని పిడిఎస్ యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ అన్నారు. కళాశాలపై ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రవిబాబు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వెలుగుమట్లలోని నారాయణ జూనియర్ కాలేజీ వద్ద పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ"అనుమతి లేకుండా అడ్మిషన్లు, అక్రమంగా తరగతుల నిర్వహణ, అధిక ఫీజులు, తల్లిదండ్రులని మోసం చేయడం, ఇవన్నీ జరుగుతున్నా జిల్లా అధికారులు ఎక్కడున్నారు..? ఎందుకు పట్టించుకోవడం లేదు..? విద్యాశాఖ నిద్రలో ఉందా..?" అంటూ ప్రశ్నించారు.విద్యార్థులకు పాఠాలు బోధించే కొంతమంది అధ్యాపకులు అసభ్యకరమైన, అవమానకరమైన మాటలతో విద్యార్థులను వేధించడంఏంటని ప్రశ్నించారు."విద్యార్థులపై అసభ్య ప్రవర్తన చేసిన అధ్యాపకులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదుచేసి, సస్పెండ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను, అలాగే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అనుమతిలేని కాలేజీలు ఖమ్మం జిల్లా లో ఎలా నడుస్తున్నాయి..? అని, అడ్మిషన్లు ఒకచోట, తరగతులు మరోచోట నిర్వహించడం ఎవరి అనుమతితోనని ప్రశ్నించారు. అధ్యాపకులు విద్యార్థులతో అసభ్య కరమైన మాటలు, ప్రవర్తనపై ఫిర్యాదులు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు..? అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలలో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా, ప్రభుత్వం... ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు మాత్రమే కొమ్ముకాస్తోందని విమర్శించారు. నియంత్రణ లేకుండా ఫీజుల దోపిడీ, అనుమతుల దందా, బ్రాంచ్ల మాఫియా నడుస్తున్నా యన్నారు. విద్యాశాఖ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఒక చోట పర్మిషన్ పొంది, మరో 2%–%3 చోట్ల బ్రాంచ్లు నడపడం దుర్మార్గం అన్నారు. తక్షణమే ఖమ్మం జిల్లా అధికారులు స్పందించి అనుమతిలేని కాలేజీల అడ్మిషన్లు వెంటనే నిలిపివేయాలి. అక్రమంగా నడుస్తున్న బ్రాంచ్లను సీజ్ చేయాలి. విద్యార్థులపై అసభ్య ప్రవర్తన చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆ కాలేజీల పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, అక్రమాలపై జిల్లా వ్యాప్తంగా భారీ ఉద్యమాలు ప్రారంభిస్తామని పి.డి.ఎస్.యూ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ ఖమ్మం డివిజన్ అధ్యక్షులు సాధిక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి యశ్వం త్ కుమార్, ఖమ్మం టౌన్ అధ్యక్షులు హరిచంద్ర ప్రసాద్, జిల్లా నాయకులు సురేష్, తరుణ్, సిద్దు, శివ, జెశ్వంత్, కాలేజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సామినేని హంతకులను అరెస్టు చేయాలి







● సీపీఐ(ఎం) భారీ ధర్నా... ఉద్రిక్తత ● కలెక్టరేట్ ఎదుట పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట ● సొమ్మసిల్లిన పలువురు ● మూడుగంటల పాటు ఆందోళన ● న్యాయం చేయాలని పాతర్లపాడు మహిళల నినాదాలు ● కలెక్టర్ బయటకు రావాలంటూ అఖిలపక్షాల నేతల డిమాండ్ ● రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారకముందే నిందితుల అరెస్టు చేయాలి ● సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ, సీపీఐ, బీఆర్ఎస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతల డిమాండ్



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు, చింతకాని మండలం పాతర్లపాడు మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్యా నేరస్తులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. మూడుగంటలకు పైగా ఈ ధర్నా ఏకబికిన సాగింది. ఈ ధర్నాకు బీఆర్ఎస్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు సైతం మద్దతు ప్రకటించాయి. హత్య జరిగి 26 రోజులవుతున్నా హంతకులను పట్టుకోవటంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నాకు తరలివచ్చారు. రామారావు స్వగ్రామం పాతర్లపాడు నుంచి గ్రామస్తులు భారీగా హాజరయ్యారు. హంతకులను వెంటనే అరెస్టు చేసి తమ గ్రామ మాజీ సర్పంచ్ రామారావు కుటుంబంతో పాటు తమ గ్రామస్తులకు న్యాయం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భటి విక్రమార్క, ఆయన సతీమణి నందినికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్న నేటి రోజుల్లోనూ పోలీసులు, ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ పోలీసు కమిషనర్కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. **పోలీసుల భారీ మోహరింపుతో ఉద్రిక్తత** కలెక్టరేట్ వద్ద ధర్నా విషయం తెలిసి పోలీసులను భారీగా మోహరించారు. నగరంలోని నాలుగు పోలీసుస్టేషన్లతో పాటు జిల్లా కేంద్రానికి సమీపంలోని రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, చింతకాని, కొణిజర్ల, ముదిగొండ తదితర ప్రాంతాల నుంచి పోలీసులను భారీగా రప్పించారు. బారికేడ్లు అడ్డుగా పెట్టి కలెక్టరేట్లోకి ఎవరూ లేకుండా బందోబస్తు చేపట్టారు. నాయకులు శాంతియుతంగా ధర్నా చేపట్టాలని ముందు నుంచే సూచించటంతో కార్యకర్తలు సమయమనం పాటించారు. కలెక్టర్కు తమ సమస్య వివరించాలని అఖిలపక్ష నేతలు కదిలిన సమయంలో పోలీసులు ఒక్కసారిగా హడావుడి మొదలుపెట్టారు. దాంతో నిరసనకారుల్లో ఆందోళన మొదల్కై అడ్డుగా ఉన్న బారికేడ్లు, పోలీసు వలయాన్ని ఛేదించుకుని కలెక్టరేట్ గేట్ల వరకూ వెళ్లారు. లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు కూడా సమయమనం పాటించాలని కోరటంతో గేటు ఎదుటే బైఠాయించి నినాదాలు చేయటం, కళాకారులతో గొంతు కలిపి రామారావుతో పాటు ఎర్రజెండా అమరుల త్యాగాలను స్మరిస్తూ గీతాలాపన చేశారు. ఉదయం 11.30 గంటలకు మొదల్కైన ధర్నా మధ్యాహ్నం 2.45 గంటల వరకూ సాగింది. **అధికారపార్టీకి పోలీసుల గులాంగిరీ: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ** అధికారపార్టీకి పోలీసులు గులాంగిరీ చేస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ ధ్వజమెత్తారు. సీపీఐ(ఎం) నాయకున్ని హత్యచేస్తే ఆ పార్టీ నాయకులు అడక్కపోతే ఎవరడుగుతారని పోలీసు కమిషనర్ సునీల్దత్ను ప్రశ్నించారు. ఇదీ ముమ్మాటికీ రాజకీయ హత్య అంటే భయపెట్టే రీతిలో ఖమ్మం సీపీ వ్యవహారం ఉందన్నారు. రామారావుది పూర్తిగా రాజకీయ హత్య, కాంగ్రెస్ పార్టీ చేసిన హత్య ఇదని ఆరోపించారు. సీపీ కాంగ్రెస్ పార్టీ నాయకునిలా వ్యవహరిస్తున్నారన్నారు. కలెక్టర్, సీపీ ఇలానే స్పందించకుండా... నిందితులను అరెస్టు చేయకుండా ఉంటే దీనిని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మలుచుతామని హెచ్చరించారు. పోలీసులు ఇలా పక్షపాతంగా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టం పట్ల గౌరవం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. చట్టప్రకారం నిందితులను అరెస్టు చేయాలని కోరుతున్నాం... ప్రజలనుకుంటే శిక్షించలేరా..? అని నిలదీశారు. రామారావు కుటుంబానికి న్యాయం జరిగే వరకూ సీపీని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. **హాస్యాస్పదంగా పోలీసు విచారణ : పోతినేని సుదర్శన్రావు** పోలీసు విచారణ అత్యంత హాస్యాస్పదంగా సాగుతోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్రావు అన్నారు. హంతకులను పట్టుకునే దిశగా కాకుండా పక్కదారి పట్టించే రీతిలో విచారణ సాగుతోందన్నారు. పోలీసులపై మల్లు భట్టివిక్రమార్క, ఆయన భార్య నందిని ఒత్తిడి పనిచేస్తోందన్నారు. మధిర నియోజకవర్గంలో జరుగుతున్న దురాఘతాలపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దృష్టిసారించాలని కోరారు. ఖబడ్దార్ భట్టి... ఈ హత్యకు ఆయనే బాధ్యత వహించాలి. లేనిపక్షంలో ఇది మరింత ఉధృతరూపం దాల్చుతుందని హెచ్చరించారు. హంతకుల పట్టుకునే వరకూ ఆందోళనలు సాగుతాయని పేర్కొన్నారు. **ఇదీ రాజకీయ హత్యే : సీపీఐ, బీఆర్ఎస్, న్యూడెమోక్రసీ నేతలు** సామినేని రామారావుది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని, హత్యకేసులో నిందితులను తేల్చటంలో పోలీసుల వైఫల్యం కనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. పోలీసులు ఈ కేసును సీరియస్గా తీసుకుని, హంతకులను శిక్షించకపోతే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రామారావు హంతకులు ఇండ్లలో ఉంటే మనం ఆందోళనలు చేయాల్సి వస్తుందంటే ప్రభుత్వ యంత్రాంగం తీరు ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్ పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందన్నారు. నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్న భట్టి తీరును తప్పుబట్టారు. దర్యాప్తు సక్రమ పద్ధతిలో సాగట్లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ ఆరోపించారు. కేసు విచారణలో పోలీసుశాఖ కట్టకథలు అల్లుతోందన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, మాదినేని రమేశ్, బంతు రాంబాబు, బండి పద్మ, మధిర, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శులు మడుపల్లి గోపాలరావు, శీలం వెంకట్రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, ఎం.సుబ్బారావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, సామినేని రామారావు సతీమణి స్వరాజ్యం, కుమారుడు విజయ్, చింతకాని మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు జానకిరామయ్య తదితరులు పాల్గన్నారు.